# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 07-07-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- 21వ శతాబ్దంలో ప్రజల పురోగతి ఎక్కువగా సాంకేతికతపై ఆధారపడి ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.

- న్యాయ విద్యార్థులు రాజ్యాంగ విలువలను నడిపించే మార్గదర్శకులు కావాలని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ ఆకాంక్షించారు.

- "ఆపరేషన్ సిందూర్" విజయం సాధించడంతో స్వదేశీ రక్షణ ఉత్పత్తులకు గిరాకీ పెరిగిందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

- ఆరోగ్య సంరక్షణను అందరికీ అందుబాటులో ఉంచే దిశగా దేశం పురోగతి సాధిస్తోందని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పి.నడ్డా అన్నారు.

========================

ఏ దేశమూ తన స్వార్థ ప్రయోజనాల కోసం కీలకమైన ఖనిజాలు, సాంకేతికతను ఆయుధాలుగా ఉపయోగించుకోకూడదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. రియో డి జెనిరోలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో ప్రధానమంత్రి మాట్లాడుతూ... 21వ శతాబ్దంలో ప్రజల పురోగతి, శ్రేయస్సు ఎక్కువగా సాంకేతికతపై మరీ ముఖ్యంగా కృత్రిమ మేధస్సు (ఏఐ)పై ఆధారపడి ఉంటుందని తెలిపారు. ఒకవైపు, AI రోజువారీ జీవితాన్ని బాగా మెరుగుపరుస్తుందని, మరోవైపు దీని వల్ల ఉత్పన్నమయ్యే ప్రమాదాలతో ఆందోళనను రేకెత్తిస్తుందని ప్రధానమంత్రి అన్నారు. అందరికీ AI అనే సూత్రం పనిచేస్తూ... నేడు భారతదేశం వ్యవసాయం, ఆరోగ్యం, విద్య పాలన వంటి రంగాలలో దీనిని విస్తృతంగా ఉపయోగిస్తోందని తెలిపారు. బాధ్యతాయుతమైన AI కోసం కలిసి పని చేయవలసిన అవసరాన్ని ప్రధానమంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

========================

దేశాభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషిస్తున్నారని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ పేర్కొన్నారు. కొచ్చిలోని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ లీగల్ స్టడీస్ (NUALS) విద్యార్థులనుద్దేశించి ఉపరాష్ట్రపతి ప్రసంగిస్తూ.. న్యాయ

విద్యార్థులు రాజ్యాంగ విలువలను నడిపించే మార్గదర్శకులు కావాలన్నారు. భారత్ ను 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. భారతదేశం స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాలను జరుపుకునేనాటికి అసాధారణ ఆర్థిక పురోగతి, అద్భుతమైన మౌలిక సదుపాయాల వృద్ధి, డిజిటలైజేషన్, ప్రపంచ గుర్తింపు, ప్రశంసలను సాధిస్తుందని ఉపరాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 36 సెకన్లు)

========================

నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను అందరికీ అందుబాటులో ఉంచే దిశగా దేశం పురోగతి సాధిస్తోందని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పి. నడ్డా అన్నారు. లక్షా 77 వేలకు పైగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు ఆరోగ్య సంరక్షణను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నాయని, ఈ-సంజీవని, టెలిమానాస్ వంటి వేదికలు ప్రత్యేక సంరక్షణలో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయని జేపీ నడ్డా అన్నారు. మిషన్ ఇంద్రధనుష్ కింద 5 కోట్ల 46 లక్షల మంది పిల్లలు, కోటీ 32 లక్షల మంది గర్భిణీ స్త్రీలకు టీకాలు వేశారని తెలిపారు. ఐక్యరాజ్యసమితి ప్రసూతి మరణాల అంచనా నివేదికల ప్రకారం, భారతదేశంలో ప్రసూతి మరణాల రేటులో 86 శాతం తగ్గుదల కనిపించిందన్నారు. గత 11 సంవత్సరాలలో, భారతదేశ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ సార్వత్రిక ఆరోగ్య సంరక్షణకు పునాది వేసిందని జె.పి.నడ్డా పేర్కొన్నారు.

========================

“ఆపరేషన్ సిందూర్” విజయం స్వదేశీ రక్షణ ఉత్పత్తులకు ప్రపంచ వ్యాప్తంగా గిరాకీ పెంచిందని రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన కంట్రోలర్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... భారతదేశ రక్షణ పరిశ్రమలకు అపారమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో, భారతదేశం రక్షణ రంగం దాదాపు స్వావలంబనను సాధించిందని ఆయన పేర్కొన్నారు. గతంలో విదేశాల నుండి దిగుమతి చేసుకున్న చాలా రక్షణ పరికరాలు.. ఇప్పుడు దేశంలోనే తయారవుతున్నాయని అన్నారు. ఇటీవల ప్రభుత్వం ఆమోదించిన పరిశోధన, అభివృద్ధి ఆవిష్కరణ పథకం (RDI) కింద ఉన్నత స్థాయి ప్రాజెక్టులను ప్రోత్సహించడంతోపాటు, కీలకమైనసాంకేతిక పరిజ్ఞానాలను సాధించడం లక్ష్యంగా పెట్టుకుందని రాజ్‌నాథ్ సింగ్ వివరిస్తూ...

(వాయిస్ 40 సెకన్లు)

విరామం

========================

గనుల రంగాన్ని పర్యావరణ పరిరక్షణతో ముందుకు తీసుకెళ్లడానికి కేంద్ర ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపట్టిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. జైపూర్‌లో ఈరోజు జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... గనుల శాఖలో చేపట్టిన ప్రభుత్వ విధానాలు గనుల పరిసరాల్లో నివసించే ప్రజలు, అందులో పనిచేసే కార్మికుల ప్రయోజనాలను కూడా కాపాడుతున్నాయన్నారు. స్థిరమైన మైనింగ్‌లో సాంకేతికతను కూడా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. గనులలో పనిచేసే కార్మికుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించామని కిషణ్ రెడ్డి పేర్కొన్నారు.

========================

దేశంలో మొక్కజొన్న సాగును ప్రోత్సహించడానికి బహుళ భాగస్వాముల విధానం అవసరమని కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పిలుపునిచ్చారు. ఈ లక్ష్యాన్ని సాధించడానికి శాస్త్రవేత్తలు, రైతులు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు కలిసి పని చేయాలని ఆయన సూచించారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన FICCI 11వ సదస్సులో

ఆయన ప్రసంగిస్తూ... రైతులకు, ఇతర వాటాదారులకు సహాయపడే విస్తృతమైన చర్చలు నిర్వహించి తగు సిఫార్సులను అందించాలని FICCIని కోరారు. ఈ సందర్భంగా, మొక్కజొన్న సాగుకు అసాధారణ కృషి చేసినందుకు ప్రగతిశీల రైతులను కేంద్రమంత్రి సత్కరించారు.

(వాయిస్ 36 సెకన్లు)

=========================

ప్రతి పౌరుడి ఆరోగ్యం, శ్రేయస్సు ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్ మురుగన్ అన్నారు. స్వస్త్ భారత్... సమృద్ధి భారత్... కింద ఇఎస్ఐ లబ్ధిదారులకు వైద్య పరీక్షా శిబిరాన్ని ఆయన ఈరోజు చెన్నైలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ పౌరుల ఆరోగ్యంపై దృష్టి సారించారని, దీనిలో భాగంగా ఆహారాలలో నూనె శాతాన్ని తగ్గించాలని, స్థూలకాయాన్ని నియంత్రించేందుకు భారతదేశ పురాతన అభ్యాసమైన యోగాను అభ్యసించడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు.

=========================

బ్రిక్స్ అనుకూల దేశాలపై అదనపు టారిఫ్‌లు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై చైనా స్పందించింది. బ్రిక్స్ సభ్యదేశాలు ఘర్షణ కోరుకోవడం లేదని స్పష్టం చేసింది. టారిఫ్ విధింపు విషయంలో తమ స్పందనలో ఏ మార్పు లేదని, రక్షణాత్మక వైఖరితో ముందుకువెళ్లలేమని చైనా పునరుద్ఘాటించింది. బ్రిక్స్‌లో అమెరికా వ్యతిరేక విధానాలకు మద్దతిచ్చే ఏ దేశానికైనా అదనంగా 10 శాతం టారిఫ్‌లు విధిస్తామని, ఇందులో ఎలాంటి మినహాయింపులు ఉండవని ట్రంప్ స్పష్టం చేశారు.

=========================

గంగా పరివాహక పశ్చిమ బెంగాల్ పరిసర ప్రాంతాల్లో అల్పపీడన ప్రభావంతో రాగల 24 గంటల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. ఇది రాబోయే రెండు రోజుల్లో జార్ఖండ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్ మీదుగా పశ్చిమ-వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉందని తెలిపింది. దీని కారణంగా తూర్పు మధ్య ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిసా రాష్ట్రాలలో వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది.

=========================
=========================